ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కిషన్‌రెడ్డి

నామినేషన్ దాఖలు

రెండో రోజు ఆరు నామినేషన్లు దాఖలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 19: ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలైంది.సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో మొదటి రోజు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. రెండో రోజు మొత్తం ఆరు నామినేషన్లు వచ్చాయి, అందులో భాగంగా బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థులు పద్మారావుగౌడ్,కిషన్‌రెడ్డిలు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. వారితో పాటు మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అమీర్‌పేట్, ఏప్రిల్ 19: ప్రతిష్ఠాత్మక శివ్‌నాడర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌లో 17 కోర్సులలో అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ ఎన్‌సీఆర్ (ఢిల్లీ) డాక్టర్ రాజీవ్‌కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం బేగంపేట్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో అడ్మిషన్ ప్రక్రియ, ఉపకార వేతనాలు, సంస్థ అందించే పరిశోధన ఆధారిత కోర్సులు, ప్లేస్‌మెంట్లకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2024-25 కోసం ఇంజినీరింగ్, నేచురల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్‌లలో 17 అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్శిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. మరిన్ని వివరాలకు http://www.snu. edu.in/home లలో సంప్రదించాలన్నారు.

నా బలం...బలగం మీరే

బీఆర్ఎస్ సర్కారులో ఇంటింటా ఏదో ఒక పథకంతో లబ్ధి - ఒకటో వార్డు ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్/బొల్లారం, ఏప్రిల్ 19: 'నియోజకవర్గ ప్రజలే నా బలం.. నా బలగం.. గతంలో జరిగిన ఎన్నికల్లో తన తండ్రి, చెల్లి మాదిరిగానే తనను ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..' అని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఒకటో వార్డులోని న్యూ బోయిన్‌పల్లి పెద్ద తోకట్ట, కంసారి బజార్‌తో పాటు పలు బస్తీల్లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత పాదయాత్ర చేపట్టారు. వార్డులోని ఇంటింటా తిరుగుతూ పదేళ్ల కాలంలో కంటోన్మెంట్‌లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ప్రజలను ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఏదో ఒక ప్రభుత్వ పథకం కింద లబ్ధి పొందారని గుర్తు చేశారు. కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మరోసారి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చే దొంగలు, బాబాలను నమ్మవద్దని సూచించారు. రైతు వ్యతిరేక ధోరణితో ముందుకెళ్తున్న కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు చోద్యం చూస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రామకృష్ణ, రాము, పద్మ, అంబిక, సబిత, మేరీ, జయ, భాగ్యమ్మ, సౌజన్య, ఇక్బాల్, రాజు, థామస్, అశ్వక్‌తో పాటు నర్సింగ్‌రావు, విజయ్, శ్రీధర్‌తో సహా యువ నాయకులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డులో..

కంటోన్మెంట్‌లో కారు దూకుడు పెంచింది. అన్ని పార్టీలకంటే ఎన్నికల ప్రచారంలో గులాబీ దూసుకుపోతుంది. దీంట్లో భాగంగా శుక్రవారం మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి రాగిడి రజిని లక్ష్మారెడ్డి, మాజీ బోర్డు సభ్యురాలు అనితా ప్రభాకర్‌తో కలిసి మూడో వార్డులో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్న ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సీనియర్ నాయకులు ఉమేశ్, సంధ్య, స్వరూప, గీత, సబిత, అనిల్, చిన్న, రాకేశ్, సచ్చు, మధు, అశోక్, శేఖర్, శ్రీను, సాధిక్, అక్తర్, అహ్మద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

న్యూ బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్వాగతం పలుకుతున్న స్థానికులు

కంసారి బజార్‌లో ఇంటింటా ప్రచారంలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

న్యూ బోయిన్‌పల్లిలోని ఓ దుకాణదారుడిని ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

పెద్దతోకట్టలో ఓ వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఓల్డ్ గాంధీనగర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు.శుక్రవారం కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని తిరుమలగిరి ఓల్డ్ గాంధీ నగర్‌లో బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ శ్యాం కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్,బీఆర్ఎస్ నాయకులు యశ్వంత్ కుమార్,రాజిరెడ్డి, సురేష్, దుర్గా ప్రసాద్, సోమయ్య,సువర్ణ,సుష్మలత, రజిని పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధుడి ఆశీర్వాదం తీసుకుంటున్న దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు, బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

పెద్ద తోకట్టలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

రోడ్లపై చెత్త వేయవద్దు

అరుణ్‌జ్యోతి కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న జీహెచ్ ఎంసీ బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 19 : నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న జీహెచ్ఎంసీకి ప్రజలు సహకరించాలని బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని అరుణ్‌జ్యోతి కాలనీలో పర్యటించారు. కాలనీ ప్రధాన, అంతర్గత వీధులలో పారిశుద్ధ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి రెండు చెత్తబుట్టలను ఇవ్వడం జరిగిందని, ఇంటింటికీ వచ్చే రిక్షా వాళ్ళకే చెత్తను ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు భరత్‌కుమార్, సుధీర్‌లు స్థానిక సమస్యలపై వివరించారు. డిప్యూటీ కమిషనర్ స్పందించి స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తల్లుల సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 19 : భువనగిరి గురుకుల హాస్టల్‌లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి కలుషి ఆహారం తిని మృతిచెందిన ఘటనపై అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనకు కారకులైన వారిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్న ఇంకా విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తల్లుల సంఘం ప్రతినిధులు భాగ్యలక్ష్మి, జమున, రామలీల, లక్ష్మి, స్వరూప, పుష్ప, ఎమ్‌వీ ఫౌండేషన్ ఆర్గనైజర్స్ ఎ.సువర్ణ, భాగ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 19 : వరల్డ్ లివర్ డే సందర్భంగా లక్డీకాపూల్‌లోని గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్‌తో కలిసి కాలేయ వ్యాధులపై అవగాహన వాకథాన్, సైక్లాథాన్‌ను నిర్వహించారు. ఈ ర్యాలీని ఆస్పత్రి సీసీఈవో డాక్టర్ నాగేశ్వర్ రావు, లీవర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ చందన్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్మిత్, డాక్టర్ రాజగోపాల్ ఆచార్య, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ వ్యవస్థాపకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓయూ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్

ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి'

స్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 19: ఉస్మానియా యూనివర్సిటీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని పలువురు అధికారులు డిమాండ్ చేశారు. ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ రవీందర్ గత మూడేళ్లగా అసోసియేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి, అసోసియేషన్ లేకుండా చేశారని ఆరోపించారు. 2022 సంవత్సరం నుంచి ఓయూ డైరీలో సైతం అసోసియేషన్ సభ్యుల పేర్లు తొలగించారని గుర్తు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశామని చెప్పారు. తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్వయంగా వచ్చి తమ సమస్యపై వీసీతో చర్చించారని చెప్పారు. కొంత మంది అసోసియేషన్ కావాలని, కొంత మంది వద్దని చెబుతున్నారని వీసీ వారితో చెప్పారని పేర్కొన్నారు. అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేసి, ఏకగ్రీవం తీర్మానం చేసుకుని తనవద్దకు తీసుకువస్తే పది రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు దానిపై స్పందించడం లేదని వాపోయారు. తక్షణమే అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో తాము ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

ద్రవిడ వర్సిటీ వీసీ ప్రొఫెసర్

మధుజ్యోతికి ఉగాది పురస్కారం

ఉగాది పురస్కారం అందుకుంటున్న ద్రవిడ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మధుజ్యోతి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 19: ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతికి ఉగాది పురస్కారం వరించింది. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందించే ఉగాది పురస్కారాలలో భాగంగా శ్రీక్రోధి నామ ఉగాది పురస్కారం అందజేశారు. త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్త, ప్రముఖ సంఘ సేవకులు పబ్బ వైకుంఠం చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె తెలుగులో ఎంఏ, పీహెచ్‌డీలతో పాటు తమిళం, అనువాదంలో పీజీ డిప్లొమాలు సైతం పూర్తి చేశారు. ఆమెకు పురస్కారం రావడం పట్ల ప్రొఫెసర్ అనురాధ, ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఎంఎస్ దుర్గాప్రవీణ్ తదితరులు అభినందించారు.

నార్త్‌జోన్‌లో రూ.52 లక్షల నగదు పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నేపథ్యంలో గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో నార్త్‌జోన్ పరిధిలో రూ.52,43,040 నగదును సీజ్ చేసినట్లు డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు నార్త్‌జోన్ పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం బై ఎలక్షన్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగదుతో పాటు 204.25 లీటర్ల మద్యం, 843 గ్రాముల బంగారు, వెండి, ప్లాటీనం ఆభరణాలు, 89.323 కిలోల గంజాయి, 900 కిలోల పీడీఎస్ రైస్‌ను సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువుల విలువ రూ.1, 15,55,888 ఉంటుందని డీసీపీ తెలిపారు. దీంతో పాటు 102 బైండోవర్ కేసుల్లో 331 మందిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

మోండా డివిజన్ వడ్డెర బస్తీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్, నాయకులు

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తన గెలుపునకు దోహదపడుతాయని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్ వడ్డెర బస్తీ, లోహియానగర్ బస్తీలో కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీ గణే ష్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమన్నారు. తనను ఎమ్మెల్యేగా ప్రజలందరూ ఆశీర్వదించి గెలిపిస్తే కంటోన్మెంట్ రూపురేఖలు మారుస్తానని చెప్పారు. ఈ సందర్భంగా లోహియా నగర్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులకు అభ్యర్థి శ్రీ గణేష్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్రినాథ్ యాదవ్, బాబురావు, ఆర్ డి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు కాంగ్రెస్‌లో చేరిక

కంటోన్మెంట్, ఏప్రిల్ 19: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు శుక్రవారం హస్తం గూటికి చేరారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు మొదలయ్యాయి. హస్తం గూటికి చేరిన వారిలో శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవస్థానం చైర్మన్ వోదుల అజయ్ కుమార్, శ్రీ గణేష్ దేవాలయ బోర్డు సభ్యులు సదానంద్ గౌడ్, పెరుమాల్ వెంకటేశ్వర స్వామి దేవాలయం ట్రస్టు సభ్యులు నరేష్, తేజ్‌పాల్‌తో పాటు రమేష్, బాల్‌రాజు, రఫీ, నాగినేని సరితలు ఉన్నారు. వీరందరికి మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కుటుంబ సంక్షేమ అధికారి వెంకట రామనర్సయ్య

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 19 : ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గాంధీ దవాఖాన, కుటుంబ సంక్షేమ అధికారి డి.వెంకట రామనర్సయ్య అన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థులకు శుక్రవారం ఆయన వడదెబ్బ లక్షణాలు, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, వృద్ధులు, బీపీ, షుగర్ ఉన్నవారు ఎండాకాలంలో ఉన్న సమయంలో బయటకు రావొద్దని అన్నారు. తరచుగా నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలను తాగాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు ఆనంద మాధవి, చరిత, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న గాంధీ దవాఖాన కుటుంబ సంక్షేమ అధికారి డి.వెంకట రామనర్సయ్య

మహనీయుల స్ఫూర్తి..ప్రతి ఒక్కరికీ అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 19: ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరికీ మహనీయుల స్ఫూర్తి అవసరమని ఓయూ పూర్వ విద్యార్థి, అమెరికాలోని సోర్స్ ట్రేస్ సీఈవో డాక్టర్ వెంకట్ మారోజు అన్నారు. రాజకీయ ప్రజాస్వామ్యం నుంచి సామాజిక ప్రజాస్వామ్యం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలోని పూలే అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇన్‌క్లూసివ్ అండ్ ఎంపవర్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా 'సోషల్ జస్టిస్ అండ్ సోషియో పొలిటికల్ చేంజ్'పై అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని రూం నెంబర్ 133లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వెంకట్ మారోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్‌రాం వంటి మహనీయుల స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆచరణీయమన్నారు. విజ్ఞానం ద్వారానే రాజకీయ, సామాజిక అసమానతలు లేని సమాచారాన్ని ఏర్పాటు చేసుకోగలమని చెప్పారు. నేటికీ లక్షలాది మంది పేదరికం, వివక్షతను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. , ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేటు విద్యావిధానానికి స్వస్తి పలికి, ప్రభుత్వ రంగంలో మాత్రమే విద్యను అందించాలని సూచించారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకే పూలే అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇన్‌క్లూసివ్ అండ్ ఎంపవర్‌మెంట్ స్టడీస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమగ్ర అధ్యయన కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, సామాజిక సమస్యలపై పరిశోధనలు జరుపుతున్నట్లు వివరించారు. ఇటీవల విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 545వ ర్యాంకు సాధించిన ఎంఏ పొలిటికల్ సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థి నరేంద్ర పడాల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సయీదా అజీమున్నీసా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు, ప్రొఫెసర్లు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాకేష్ కిరణ్

అమీర్‌పేట్, ఏప్రిల్ 19 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సనత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి కథనం ప్రకారం ..సనత్‌నగర్ ఎస్ఆర్టీ కాలనీకి చెందిన రాకేష్ కిరణ్ (37)కు షేర్ మార్కెట్ లావాదేవీలతో పాటు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. అయితే ఇటీవల తీవ్ర నష్టాలు ఎదురు కావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఇంట్లో గుర్తు తెలియని రసాయనాలు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. రాకేష్ పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యను

పరిష్కరించండి

గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లో తాగునీటి లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జైస్వాల్‌గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. ఈ మేరకు గోల్నాక సెక్షన్ మేనేజర్ రోహిత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం కాలనీలో పర్యటించి లోప్రెషర్ సమస్యను పరిశీలించారు. కాలనీ చివరి వీధిలో కొన్ని రోజులుగా తాగునీరు లోప్రెషర్‌తో వస్తుందని చెప్పా రు. దీనికి స్పందించిన మేనేజర్ చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాలనీవాసులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, వీణా, మంగ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను సాధించాలి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కాశీం

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : జాతీయ పోషకాహార సంస్థలో శుక్రవారం డా. బీఆర్ అంబేద్కర్ 133వ, డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓయూ కాలేజీ ప్రొఫెసర్ కాశీం ముఖ్య అతిథిగా పాల్గొని మహనీయులు కృషిని కొనియాడారు. కార్యక్రమానికి ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత అధ్యక్షత వహించగా... పరిశోధకులు, విద్యార్థులు, సామాజికవేత్తలు, అంబేద్కర్ వాదులు భారీగా హాజయ్యారు.

విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 19: రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప కంచెలకు విద్యుత్ సరఫరా కావడంతో గుర్తు తెలియని ఓ వ్యక్తి వాటిని పట్టుకొని.. అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మారేడ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మారేడ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఏఓసీ సెంటర్‌లోకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఈ ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా అవుతోంది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (45) ఇనుప కంచెను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.